పూర్తి చేయరు.. ప్రారంభించరు!

గ్రామాల్లో అన్ని వర్గాల పేదలకు అందుబాటులో ఉండేలా గత ప్రభుత్వం ఫంక్షన్ హాళ్ల నిర్మాణ పనులకు శ్రీకారం చుట్టింది. ఒక్కోదానికి దాదాపుగా రూ.కోటికి పైగా నిధులు మంజూరు చేసింది. కానీ చాలా చోట్ల నిర్మాణ పనులు ఐదేళ్లుగా కొనసాగుతూనే ఉన్నాయి. దీంతో అవి అసాంఘిక కార్యకలాపాలకు అడ్డాలుగా మారాయి.

- ఫంక్షన్‌హాల్ పనుల్లో తీవ్ర జాప్యం
- ఏళ్లుగా సాగుతున్న పనులు
- అసాంఘిక కార్యక్రమాలకు అడ్డా..
- ఇబ్బందులు పడుతున్న ప్రజలు



జగదేవ్‌పూర్‌లో నిలిచిన ఫంక్షన్ హాల్ నిర్మాణ పనులు

జగదేవ్‌పూర్(గజ్వేల్): ఉమ్మడి జగదేవ్‌పూర్ మండలంలోని 29 గ్రామాలు ఉన్నాయి. పీర్లపల్లి, మునిగడప, బిజివెంకటాపూర్, గొల్లపల్లిలో ఫంక్షన్‌హాళ్ల నిర్మాణ పనులు పూర్తిచేశారు. మిగతా చోట్ల నేటికీ నిర్మాణ పనులు పూర్తికాక ప్రారంభించలేదు. తిమ్మాపూర్, చాట్లపల్లి, బస్వాపూర్, తిగుల్, జగదేవ్‌పూర్, ధర్మారం, ఇటిక్యాల, చిన్నకిష్టాపూర్, తిగుల్‌నర్సాపూర్, వట్టిపల్లి గ్రామాల్లో నిర్మాణ పనులు కొనసాగుతూనే ఉన్నాయి. నిర్మాణ పనులు ఐదారేళ్లుగా కొనసాగుతునే ఉన్నాయి. నేటికీ పూర్తి చేయలేకపోవడం వల్ల ఆయా గ్రామాల్లో పేద ప్రజలు తమ వేలాది రూపాయలు ఖర్చు చేయలేక తమ శుభకార్యాలు ఇంటి వద్దనే జరుపుకుంటున్నారు.

ముందుకు సాగని పనులు

గ్రామాల్లో సగం పనులు పూర్తయిన ఫంక్షన్ హాళ్లలో రైతుల ధాన్యం దాచుకోవడానికి, అసాంఘిక కార్యక్రమాలకు అడ్డాలుగా మారాయి. ఆయా గ్రామాల్లో నిర్మాణ పనులు ముందుకు సాగడం లేదనేది వాస్తవమేనని అధికారులు చెప్తున్నారు.

ఫంక్షన్ హాళ్ల నిర్మాణ పనులు పూర్తి చేయండి



ఇటిక్యాలలో నిర్మించిన ఫంక్షన్ హాల్ నిర్మాణ పనులు మధ్యలో ఆగిపోయాయి. రెండు హాళ్లు పూర్తయినప్పటికీ చిన్నచిన్న పనులు పూర్తి చేయలేక పనులు నిలిపివేశారు. అధికారులు స్పందించి వెంటనే పూర్తిచేసి హాల్‌ను ప్రారంభించాలి.

– భాస్కర్, మాజీ ఎంపీటీసీ

చెడు అలవాట్లకు బానిసలు కావొద్దు

- ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్ వెంకటయ్య



మాట్లాడుతున్న రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ కమిషన్ వెంకటయ్య

మిరుదొడ్డి(దుబ్బాక): యువత చెడు అలవాట్లకు బానిసలుగా మారి బంగారు భవిష్యత్‌ను నాశనం చేసుకోవద్దని రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్య పిలుపునిచ్చారు. రన్ ఫర్ యాంటీ డ్రగ్స్ యూత్ ఫోర్స్, సిద్దిపేట రన్నర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో సోమవారం మండల పరిధిలోని అందె గ్రామంలో నిర్వహించిన 2కే రన్ కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ డ్రగ్స్‌ను తరిమి కొట్టడానికి ప్రతి ఒక్కరు పాటు పడాలన్నారు. గ్రామీణ యువతను మేలుకొల్పడానికి 2కే రన్ పేరుతో మత్తును వదిలించడానికి యువతను ఏకతాటిపైకి తేవడం హర్షించదగిన విషయమన్నారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు తోట కమలాకర్‌రెడ్డి, నాయకులు లక్ష్మీలింగం, సత్యనారాయణ, ఎండీ అహ్మద్, బాల్‌రాజు, శంకర్, భైరయ్య, ఐలయ్య, ప్రవీణ్, శ్రీహరి తదితరులు పాల్గొన్నారు.

డప్పు కళకు ప్రపంచ గుర్తింపు

అణగారిన కులాల్లో పుట్టిన డప్పు కళకు ప్రపంచ గుర్తింపు లభించడం గర్వించదగిన విషయమని వెంకటయ్య అన్నారు. మండల పరిధిలోని అందె గ్రామానికి చెందిన ఉస్తాద్ బిస్మిల్లా ఖాన్ అవార్డు గ్రహీత అందె భాస్కర్‌ను డీబీఎఫ్ ఆధ్వర్యంలో సోమవారం ఘనంగా సన్మానించి సత్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. కార్యక్రమంలో డీబీఎఫ్ జాతీయ కార్యదర్శి పి.శంకర్, నర్సింహులు పాల్గొన్నారు.

వరి నారులో సస్యరక్షణ తప్పనిసరి



నారుమడిని పరిశీలిస్తున్న ఏఓ జయంత్

చిన్నకోడూరు(సిద్దిపేట): వరి నారుమడిలో సస్యరక్షణ చర్యలు చేపట్టాలని ఏఓ జయంత్ కుమార్ చెప్పారు. మండల పరిధిలోని అల్లీపూర్, రామంచ, రామునిపట్ల పెద్దకోడూరులో నారు మడులను సోమవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చలి తీవ్రత వల్ల భూమిలో పోషకాల లభ్యం తగ్గిపోయి నారు ఎర్రబడి, ఎదుగుదల తగ్గి పసుపురంగుకు మారుతుందన్నారు. నారుమడిపైన సాయంత్రం టార్పాలిన్ కవర్లు కప్పాలని చెప్పారు. అలాగే ప్రతిరోజు నారుకు కొత్త నీరు పెట్టాలన్నారు. నివారణకు 19:19:19 ఐదు గ్రాములు లీటర్ నీటికి కలిపి పిచికారీ చేయాలన్నారు. కనిష్ఠ ఉష్ణోగ్రతలు పడిపోవడంతో జింకు లోపం ఏర్పడి ఆకులపై తుప్పు పట్టిన ఆకుపచ్చ మచ్చలు ఏర్పడుతాయని, వాటి నివారణకు రెండు గ్రాముల జింక్ సల్ఫేట్‌ను నీటిలో కలిపి పిచికారీ చేయాలని సూచించారు. ఆయన వెంట ఏఈఓలు, రైతులు ఉన్నారు.

డైట్ చార్జీలు పెంచిన ఘనత కాంగ్రెస్‌దే..

- మత్స్య సహకార సంఘం చైర్మన్ సాయికుమార్



విద్యార్థులతో కలిసి భోజనం చేస్తున్న సాయికుమార్

సిద్దిపేటఅర్బన్: కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలోనే హాస్టల్ విద్యార్థులకు డైట్, కాస్మెటిక్ ఛార్జీలను పెంచిన ఘనత కాంగ్రెస్ ప్రభుత్వానిదేనని రాష్ట్ర మత్స్య సహకార సంఘం చైర్మన్ మెట్టు సాయికుమార్ అన్నారు. మండల పరిధిలోని మిట్టపల్లి సాంఘిక సంక్షేమ బాలికల గురుకుల పాఠశాలను కాంగ్రెస్ నాయకులతో కలిసి సోమవారం సందర్శించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు అందిస్తున్న భోజనాన్ని, వంట గదిని, నిత్యావసర సరుకులను పరిశీలించి విద్యార్థులతో కలిసి భోజనం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం బడుగు బలహీన వర్గాలకు అండగా నిలుస్తోందన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు, కళాశాల ప్రిన్సిపాల్ లక్ష్మాంజలి, ఆర్ఐ నర్సింహులు పాల్గొన్నారు.

'భగీరథ' ఓవర్ ఫ్లో

- వాటర్ మెన్ పొలానికి తరలింపు
- చర్యలు తీసుకోవాలని స్థానికుల డిమాండ్



ట్యాంకు నుంచి పొలంలోకి చేరుతున్న నీరు

కొమురవెల్లి(సిద్దిపేట): మండలంలోని తపాస్‌పల్లిలో మిషన్‌భగీరథ నీరు వాటర్‌మెన్ తన పంట పొలానికి అక్రమంగా వినియోగించుకుంటున్నాడని ఆరోపిస్తూ గ్రామస్తులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. గ్రామంలోని నివాసాలకు సక్రమంగా తాగు నీటిని సరఫరా చేయడంలో నిర్లక్ష్యం వహిస్తూ తన పొలానికి నీటిని వాడుకునేందకు ఉద్దేశ్య పూర్వకంగా ట్యాంకు ఓవర్ ఫ్లో అయ్యేవిధంగా వాటర్ మెన్ సిద్దులు చేస్తున్నాడని మండి పడుతున్నారు. గతంలో కూడా భగీరథ నీరు తన పొలానికి వాడుకున్నాడని, పలు మార్లు అధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వెంటనే వాటర్ మెన్‌పై చర్యలు తీసుకోవాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు.

మాజీ సర్పంచ్‌ల ముందస్తు అరెస్టు

హుస్నాబాద్‌రూరల్/మద్దూరు(హుస్నాబాద్): సచివాలయం ముట్టడికి పిలుపునిచ్చిన నేపథ్యంలో పలువురు మాజీ సర్పంచ్‌లను పోలీసులు సోమవారం ముందస్తుగా అరెస్టు చేశారు. గ్రామాల్లో అభివృద్ధి పనులు చేసిన మాజీ సర్పంచ్‌లకు పెండింగ్ బిల్లులు చెల్లించాలని డిమాండ్ చేస్తూ సచివాలయం ముట్టడికి సర్పంచ్‌ల సంఘం రాష్ట్ర కమిటీ పిలుపు ఇచ్చింది. ఈ క్రమంలో మాజీ సర్పంచ్‌లు హైదరాబాద్‌కు వెళ్లకుండా ఉండేందుకు ముందస్తుగా పోలీసులు మాజీ సర్పంచ్‌లను అదుపులోకి తీసుకొని స్టేషన్‌కు తరలించారు. ఈ సందర్భంగా మాజీ సర్పంచ్‌లు మాట్లాడుతూ అప్పులు చేసి అభివృద్ధి పనులు చేశామన్నారు. తెచ్చిన అప్పులకు వడ్డీలు పెరుగుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం స్పందించి తమ బిల్లులు చెల్లించాలని డిమాండ్ చేశారు. అరెస్టయిన వారిలో ఊట్ల రవీందర్‌రెడ్డి, సుందరగిరి స్రవంతి పర్ష రాములు, జీడికంటి సుదర్శన్ ఉన్నారు.

దళారులకు ఇవ్వొద్దు



నాగరాజు

హుస్నాబాద్‌రూరల్: పత్తి పంట సాగు చేసిన రైతులు తమ పట్టా పాసు పుస్తకాలను దళారులకు ఇవ్వొద్దని మండల విద్యాధికారి నాగరాజు సూచించారు. సాక్షిలో ప్రచురించిన 'పత్తి రైతు పరేషాన్' కథనానికి ఆయన స్పందించారు. సోమవారం ఆయన మాట్లాడుతూ నిజమైన పత్తి రైతులకు సీసీఐలో అమ్ముకొనేందుకు ధ్రువీకరణ ఇస్తామన్నారు. చాలా మంది రైతులు క్వింటాలుకు రూ.300లు తీసుకొని పట్టాపాసు పుస్తకాలు దళారులకు ఇస్తున్నారని, ఈ సమాచారం మేరకే ధ్రువీకరణలు ఎవరికీ ఇవ్వడం లేదని చెప్పారు. క్షేత్రస్థాయిలోను, ఇంటి వద్ద పత్తి ఉంటే ఏఈఓలు పరిశీలించి ధ్రువీకరణ ఇస్తారని ఆయన చెప్పారు.

సాక్షి ఎఫెక్ట్..

పరీక్షా కేంద్రాల పరిశీలన

సిద్దిపేటఅర్బన్: గ్రూపు–2 పరీక్ష రాయడానికి వచ్చిన అభ్యర్థులను తనిఖీ చేసే విధానాన్ని ఏసీపీ మధు సోమవారం పరిశీలించారు. ఇందూరు ఇంజినీరింగ్ కళాశాల కేంద్రం వద్ద అభ్యర్థులను పోలీస్ అధికారుల తనిఖీలపై ఆయన పలు సూచనలు చేశారు.

క్రీడల్లో రాణించినప్పుడే గుర్తింపు



క్రీడాకారులతో రంగారెడ్డి తదితరులు

గజ్వేల్‌రూరల్: క్రీడల్లో రాణించినపుడే మంచి గుర్తింపు లభిస్తుందని బేస్‌బాల్ అసోసియేసన్ జిల్లా అధ్యక్షుడు రంగారెడ్డి అన్నారు. 14 నుంచి 16 వరకు మహబూబ్‌నగర్ జిల్లాలోని ఎస్‌టీఆర్ స్టేడియంలో జరిగిన బేస్‌బాల్ రాష్ట్రస్థాయి ఇంటర్ డిస్ట్రిక్ట్ సీనియర్ పురుషుల చాంపియన్ షిప్ పోటీల్లో సిద్దిపేట జిల్లా జట్టు ద్వితీయ స్థానంలో నిలిచింది. ఈ సందర్భంగా ప్రజ్ఞాపూర్‌లోగల సెయింట్ మేరీస్ విద్యానికేతన్‌లో సోమవారం క్రీడాకారులను అభినందించారు. అనంతరం రంగారెడ్డి మాట్లాడుతూ పోటీల్లో దినేశ్ కార్తీక్, విఠల్, జగస్, దేవిశ్రీప్రసాద్ అవార్డులను అందుకోవడం సంతోషకరమన్నారు. కార్యక్రమంలో బేస్ బాల్ అసోసియేషన్ ఆర్గనైజింగ్ సెక్రెటరీ ప్రవీణ్‌గౌడ్, సెక్రెటరీ మధుయాదవ్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

కమాన్ వద్ద బస్సు షెల్టర్ నిర్మించాలి



కమాన్‌వద్ద నిరసన వ్యక్తం చేస్తున్న నాయకులు

కొమురవెల్లి(సిద్దిపేట): ప్రముఖ పుణ్యక్షేత్రం మల్లికార్జున స్వామి ఆలయ సమీపంలోని రాజీవ్ రహదారిలో ఉన్న కమాన్ వద్ద బస్సు షెల్టర్, మరుగుదొడ్లు నిర్మించాలని సీపీఎం మండల కార్యదర్శి తాడూరి రవీందర్ డిమాండ్ చేశారు. కార్యకర్తలతో కలసి కమాన్ వద్ద సోమవారం ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ స్వామి దర్శనానికి వివిధ ప్రాంతాల నుంచి నిత్యం ఎంతో మంది వస్తారని, కాని ఎలాంటి సౌకర్యాలు లేవన్నారు. బస్సు షెల్టర్, మరుగుదొడ్లు నిర్మించేలా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఇస్తారి, వరలక్ష్మి, సాయిలు తదితరులు పాల్గొన్నారు.



ఆత్మీయ సమ్మేళనంలో పాల్గొన్న పూర్వ విద్యార్థులు

'అపూర్వ' సమ్మేళనం

కొండపాక(గజ్వేల్): మండల కేంద్రమైన కుకునూరుపల్లి హైస్కూల్లో 1989–90లో పదోతరగతి చదువుకున్న పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. మాత్‌పల్లి శివారులోని హిడెన్ క్యాజల్ రిసార్టులో సోమవారం వారంతా ఉత్సాహం, ఉల్లాసంగా జరుపుకున్నారు. 35 యేళ్ల తరువాత కలుసుకొని సందడి చేశారు. తమకు చదువు నేర్పిన ఆనాటి ఉపాధ్యాయులను ఘనంగా సన్మానించారు. పూర్వ విద్యార్థులు కాచం నవీన్, పిస్క అమరేందర్, అశోక్, బాలయ్య, మురళి, అంజలి, స్వప్న, విమల, శ్రీమతి, సుచరిత తదితరులు పాల్గొన్నారు.

మూగజీవాలపై జంతువు దాడి

కొండపాక(గజ్వేల్): మండలంలోని జప్తినాచారం శివారులో గుర్తుతెలియని జంతువు దాడిలో మూగజీవాలు మృతి చెందుతున్నాయని గ్రామస్తులు ఆందోళన చెందుతున్నారు. గ్రామానికి చెందిన ఉప్పలయ్య వ్యవసాయ బావి వద్ద సోమవారం జంతువు దాడిలో ఓ గొర్రె మృత్యు వాత పడింది. అంతకు ముందు లేగదూడ మృతి చెందిందని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. ఆ జంతువు హైనా అయిఉండవచ్చని చెప్తున్నారు. అధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

కాంగ్రెస్‌తోనే అభివృద్ధి సాధ్యం

మద్దూరు(హుస్నాబాద్): కాంగ్రెస్‌తోనే రాష్ట్రం అన్నిరంగాల్లో అభివృద్ధి చెందుతుందని జనగామ జిల్లా యూత్ ఉపాధ్యక్షుడు చెట్కూరి కమాలకర్ యాదవ్ అన్నారు. సోమవారం దూల్మిట్ట మండలంలోని జాలపల్లిలో ఇందిరమ్మ ఇళ్ల సర్వేలో పాల్గొన్నారు. ఆయన మాట్లాడుతూ బడుగు బలహీన వర్గాల సంక్షేమం కోసం రాష్ట్ర ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు సాగర్, వెంకటేశ్, సాంబరెడ్డి, చక్రపాణి తదితరులు పాల్గొన్నారు.

పరీక్షా కేంద్రం వద్ద నిబంధనలు

సిద్దిపేటకమాన్: ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో 18నుంచి 24వరకు డీఈడీ (డిప్లొమా ఎలిమెంటరీ ఎడ్యుకేషన్) పరీక్షలు ఉన్నందున కేంద్రం వద్ద నిబంధనలు అమలులో ఉంటాయని సీపీ అనురాధ తెలిపారు. ఉదయం 6నుంచి సాయంత్రం 4గంటల వరకు సమీపంలోని అన్ని జిరాక్స్ సెంటర్లను మూసి ఉంచాలని, 500 మీటర్ల వరకు ప్రజలు గుమిగూడి ఉండకూడదని ఆమె హెచ్చరించారు.

మత్తు పదార్థాల నివారణపై అవగాహన

గజ్వేల్‌రూరల్: యువత చెడు వ్యసనాలకు బానిసలు కావద్దని మహిళా డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ అనిత అబ్రహం పిలుపునిచ్చారు. మండల పరిధిలోని గిరిపల్లి, ధర్మారెడ్డిపల్లిలో ఎన్ఎస్ఎస్ 1, 2వ యూనిట్‌లకు చెందిన వలంటీర్లతో కలిసి సోమవారం మద్యపానం, మాదకద్రవ్యాల వ్యసనం, ధూమపానం వల్ల కలిగే అనర్థాలపై ప్లకార్డులు, పోస్టర్లను ప్రదర్శిస్తూ గ్రామస్తులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ ప్రోగ్రామ్ అధికారులు కస్తూరిబాయి, డాక్టర్ జయరాజు, వైస్ ప్రిన్సిపాల్ కమలా క్రిస్టియాన, పంచాయతీ కార్యదర్శులు జలాలుద్దీన్, పరమేశ్వర్, ఎన్ఎస్ఎస్ వలంటీర్లు పాల్గొన్నారు.

నేడు విద్యుత్‌కు అంతరాయం

ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): పట్టణంలోని 11కేవీ లింగారెడ్డిపల్లి ఫీడర్ పరిధిలో చెట్ల కొమ్మల తొలగింపు కారణంగా మంగళవారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని అసిస్టెంట్ డివిజనల్ ఇంజనీర్ సుధాకర్‌రెడ్డి సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. లింగారెడ్డిపల్లి, ఇందిరమ్మకాలనీ ప్రాంతాలలో ఉదయం 9.30 నుండి మధ్యాహ్నం 12.30 వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్టు తెలిపారు.

రిలయన్స్ స్మార్ట్‌లో తనిఖీ రూ.20వేల జరిమానా



తనిఖీ చేస్తున్న ఆశ్రిత్ కుమార్

సిద్దిపేటజోన్: నిబంధనలు ఉల్లంఘించి సింగిల్ ప్లాస్టిక్ కవర్లు వాడుతున్నారని స్థానిక రిలయన్స్ స్మార్ట్‌కు మున్సిపల్ అధికారులు రూ.20వేలు జరిమానా విధించారు. సోమవారం మున్సిపల్ కమిషనర్ ఆశ్రిత్ కుమార్ సిబ్బందితో ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా సింగిల్ యూజ్ ప్లాస్టిక్ కవర్లు వాడుతున్నారని గుర్తించి జరిమానా విధించారు. ఇప్పటికే మున్సిపల్ ఆధ్వర్యంలో అవగాహన కల్పించామని, వ్యాపార వాణిజ్య సంస్థలు ప్లాస్టిక్ కవర్లను వాడొద్దని సూచించారు. ఆయన వెంట శానిటరీ ఇన్‌స్పెక్టర్ మాధవి తదితరులు ఉన్నారు.

క్లుప్తంగా

ఎల్లమ్మ చెరువు కాలువల పరిశీలన



కాలువలను పరిశీలిస్తున్న అధికారులు

హుస్నాబాద్: పట్టణంలోని ఎల్లమ్మ చెరువు ఎడమ, కుడి కాలువలను ఇరిగేషన్ అధికారులతో కలిసి జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ కేడం లింగమూర్తి సోమవారం పరిశీలించారు. ఎడమ, కుడి కాలువల్లో పూడిక, గడ్డి పేరుకుపోయి సాగునీరు సరిగా అందక రైతులు ఇబ్బందులు పడుతున్నారని ఆయన అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. తరచూ లీకేజీలతో నీరు వృథాగా పోతుందని, ఈ రెండు కాలువలకు మరమ్మతులు చేపట్టి రైతులకు సాగునీరు అందించేలా చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో ఇరిగేషన్‌శాఖ ఈఈ రాములు నాయక్, ఏఈ శ్రీధర్, మార్కెట్ కమిటీ డైరెక్టర్ భిక్యా నాయక్ పాల్గొన్నారు.

కుట్టు మిషన్‌ల పంపిణీ



కుట్టు మిషన్‌ల అందజేస్తున్న రాము

చిన్నకోడూరు(సిద్దిపేట): మండల పరిధిలోని రామునిపట్ల గ్రామంలో లోనాక్ సంస్థ ఆధ్వర్యంలో సోమవారం మహిళలకు కుట్టు శిక్షణ ఇచ్చి మిషన్‌లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా సంస్థ డైరెక్టర్ రాము మాట్లాడుతూ మహిళలు కుట్టు మిషన్‌ల ద్వారా ఉపాధి పొంది ఆర్థికంగా బలపడాలన్నారు. మహిళలు చిన్న చిన్న పరిశ్రమలు, వ్యాపారాలు చేసుకుంటూ కుటుంబానికి ఆసరగా నిలవాలని సూచించారు. కార్యక్రమంలో సంస్థ ప్రతినిధులు శ్రీనివాస్, రజిత, మాజీ సర్పంచ్ శ్రీనివాస్, మహిళలు పాల్గొన్నారు.

ఘనంగా స్వపరిపాలన దినోత్సవం



విద్యార్థులతో ఉపాధ్యాయులు

అక్కన్నపేట(హుస్నాబాద్): మండలంలోని అంతకపేట మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలల్లో స్వపరిపాలన వేడుకలు సోమవారం ఘనంగా జరిగాయి. విద్యార్థులు ఉపాధ్యాయులుగా తోటివారికి పాఠాలు బోధించారు. అనంతరం ఎంఈఓ గుగులోతు రంగా విద్యార్థులకు బహుమతులు అందజేశారు. హెచ్ఎం ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఏపీజీవీ సేవలకు అంతరాయం

మిరుదొడ్డి(దుబ్బాక): వరంగల్ ప్రధాన కేంద్రంగా తెలుగు రాష్ట్రాల ప్రజలకు బ్యాంకింగ్ సేవలందిస్తున్న ఏపీజీవీబీ (ఆంధ్రప్రదేశ్ గ్రామీణ వికాస్ బ్యాంక్) తెలంగాణ గ్రామీణ బ్యాంకులో విలీనం కానున్న నేపథ్యంలో ఈ నెల 28 నుంచి, 31 వరకు నాలుగు రోజుల పాటు సేవలకు అంతరాయం కలగనుందని అక్బర్‌పేట-భూంపల్లి మండల పరిధిలోని ఖాజీపూర్ బ్రాంచ్ మేనేజర్ రాజశేఖర్ తెలిపారు. సోమవారం ఆయన మాట్లాడుతూ యూపీఐ, నెట్ బ్యాంకింగ్, ఏటీఎం, సీఎస్‌పీ సేవలు పూర్తిగా నిలిచి పోతాయన్నారు. అత్యవసర లావాదేవీలుంటే 27లోపు పూర్తి చేసుకోవాలని సూచించారు. జనవరి ఒకటి నుండి తెలంగాణ గ్రామీణ బ్యాంక్ పేరుతో ఖాతాదారులకు సేవలను పునఃప్రారంభిస్తామని తెలిపారు.

యువతకు స్ఫూర్తి రమేశ్



నివాళులర్పిస్తున్న నాయకులు

సిద్దిపేటజోన్: సిద్దిపేట మున్సిపల్ మాజీ చైర్మన్ రమేశ్ నేటి యువ నాయకులకు ఎంతో స్ఫూర్తిదాయకమని మున్సిపల్ మాజీ చైర్మన్ రాజనర్స్ అన్నారు. సోమవారం భారత్ నగర్‌లోని రమేశ్ విగ్రహం వద్ద నిర్వహించిన వర్ధంతి కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన రమేశ్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. మాజీ వైస్ చైర్మన్ శివప్ప, మాజీ కౌన్సిలర్లు వేణుగోపాల్ రెడ్డి, సాయిరామ్, శ్రీనివాస్, శ్రీకాంత్ రెడ్డి, వెంకటేశ్ తదితరులు పాల్గొన్నారు.

సంక్షిప్త వార్తలు

◆ రెవెన్యూ డివిజన్ కోరుతూ వినతి

మద్దూరు(హుస్నాబాద్): చేర్యాలను వెంటనే రెవెన్యూ డివిజన్‌గా ఏర్పాటు చేయాలని సీపీఎం జిల్లా కమిటీ సభ్యుడు అలేటి యాదగిరి డిమాండ్ చేశారు. పార్టీ ఇతర నాయకులతో కలిసి సోమవారం తహసీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించి ఆర్ఐ రమేశ్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత పాలకుల వైఫల్యం వల్లే చేర్యాల నియోజకవర్గం జనగామలో కలిసిందన్నారు. ఈ ప్రాంత ప్రజల చిరకాల కోరికను నెరవేర్చాలని డిమాండ్ చేశారు. అలాగే చేర్యాల రెవెన్యూ డివిజన్ జేఏసీ మండల కన్వీనర్ రామడుగు బాలరాజు ఆర్ఐకి వినతి పత్రం అందజేశారు. పార్టీ, జేఏసీ నాయకులు పాల్గొన్నారు.

◆ న్యాయం చేయాలని రైతుల వినతి

సిద్దిపేటజోన్: అంతగిరి, రంగనాయకసాగర్ రిజర్వాయర్ల నిర్మాణం కోసం సేకరించిన అదనపు భూమికి సంబంధించి నష్టపరిహారం రాలేదని, తమకు న్యాయం చేయాలని చిన్నకోడూర్ మండలం ఎల్లయిపల్లి రైతులు సోమవారం ఆర్డీఓ కార్యాలయంలో వినతి పత్రం అందజేశారు. నోటిఫికేషన్ ఆధారంగా భూమిని రీ సర్వేచేసి, పూర్తిగా నష్టపరిహారం చెల్లించాలని కోరారు.

◆ మధ్యాహ్న భోజన నిర్వహణలో అప్రమత్తం

బెజ్జంకి(సిద్దిపేట): విద్యార్థులకు అందించే మధ్యాహ్న భోజన నిర్వహణలో అప్రమత్తంగా ఉండాలని మాజీ ఎంపీపీ, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు ఒగ్గు దామోదర్ నిర్వాహకులకు సూచించారు. ఆదివారం బెజ్జంకి మోడల్ స్కూల్‌లో ఆయన మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించారు. కార్యక్రమంలో నాయకులు రత్నాకర్‌రెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, సంతోష్, మల్లేశం, శ్రీనివాస్, ఐలయ్య, రాజేందర్, హరికృష్ణ పాల్గొన్నారు.

◆ కల్యాణం సమీపిస్తున్నా ఏర్పాట్లపై నిర్లక్ష్యం

కొమురవెల్లి(సిద్దిపేట): మల్లికార్జున స్వామి కల్యాణం 29న జరగనుంది. కాని ఆలయ అధికారులు ఏర్పాట్లపై నిర్లక్ష్యం వహిస్తున్నారు. ప్రతియేటా స్వామి కల్యాణానికి ముందు ఆహ్వాన పత్రికలను మంత్రులు, ఎమ్మెల్యేలు, ముఖ్య నేతలకు అందజేస్తారు. పోస్టర్‌ను ఆవిష్కరించి ప్రచారం చేస్తారు. కాని అవేవీ జరగకపోవడం పలు అనుమానాలకు తావిస్తోందని పలువురు అంటున్నారు.

◆ రాష్ట్ర కార్యదర్శిగా బాలబ్రహ్మం

కొండపాక(గజ్వేల్): మండలంలోని తిమ్మారెడ్డిపల్లి మాజీ సర్పంచ్ బూర్గోజు బాలబ్రహ్మం రాష్ట్ర విశ్వబ్రాహ్మణ విశ్వకర్మ సంఘం కార్యదర్శిగా ఏకగ్రీవంగా ఎంపికయ్యారు. హైదారాబాద్‌లోని సంఘం కార్యాలయంలో సోమవారం ఆ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు మదన్ మోహన్ నియామక పత్రం అందజేశారు.

◆ ధనుర్మాసం మహావిష్ణువుకు ప్రీతికరం

వర్గల్(గజ్వేల్): శ్రీమహావిష్ణువుకు ధనుర్మాసం అత్యంత ప్రీతికరమని, ఈ పర్వదినాల్లో స్వామివారిని సేవిస్తే సకల శుభాలు కలుగుతాయని విద్యాసరస్వతి క్షేత్ర వ్యవస్థాపక చైర్మన్ చంద్రశేఖరశర్మ సిద్దాంతి అన్నారు. సోమవారం క్షేత్రంలోని శ్రీకల్యాణ వెంకటేశ్వరాలయంలో ధనుర్మాసోత్సవాలకు అంకురార్పణ జరిగింది.

◆ సంక్షేమాన్ని విస్మరించిన రాష్ట్ర ప్రభుత్వం

బెజ్జంకి(సిద్దిపేట): రాష్ట్ర ప్రభుత్వం ప్రజల సంక్షేమాన్ని విస్మరించిందని బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు ఎరబెల్లి సంపత్‌రావు ఆరోపించారు. మండలంలోని పలు గ్రామాలలో సోమవారం బూత్ కమిటీలు నియమించారు.